సాక్షి ఒడిశా

శనివారం | 19 | అక్టోబర్ | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,65,143లు, బంగారం 40 గ్రాముల 500 మిల్లీగ్రాములు వెండి 67 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో గజలక్ష్మి అమ్మవారికి పూజలు - 8లో.

స్థానిక న్యూకాలనీలోని గజలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు జరుగుతున్నాయి.

కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలో ఎంపీ సప్తగిరి

కొరాపుట్: త్వరలో జరగనున్న మహారాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమరంలో కాంగ్రెస్ పార్టీ కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కకి గురుతర బాధ్యత అప్పగించింది. అక్కడ కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సభ్యుడిగా ఉల్కని నియమించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మధుసూదన్ మిస్త్రీ నాయకత్వంలో కమిటీ న్యూఢిల్లీలో సమావేశమైంది. ఆ రాష్ట్రంలో పోటీ చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, ఆశావహులు, మ్యానిఫెస్టో, ప్రచారాలు తదితర విషయాల్లో ఉల్కకి బాధ్యతలు అప్పగించారు.

న్యూస్‌రీల్

రాష్ట్రానికి భారీ వర్ష సూచన

భువనేశ్వర్: బంగాళాఖాతంలో తుఫాన్‌కు అనుకూల వాతావరణం బలపడుతోంది. ఈ నెల 20 నాటికి ఉత్తర అండమాన్ సాగరంలో వాయుగుండం ఏర్పడుతుంది. దీని ప్రభావంతో ఈ నెల 22 నాటికి కేంద్ర బంగాళాఖాతంలో అల్ప పీడనం కేంద్రీకృతం అవుతుంది. క్రమంగా వాయువ్య దిశలో కదులుతూ ఘనీభవించడంతో ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు భారీగా వర్షం కురిసే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం శుక్రవారం తెలిపింది.

14 జిల్లాలకు ఎల్లో వార్నింగ్

తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రాష్ట్రంలో 14 జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేశారు. శనివారం వరకు ఈ హెచ్చరిక వర్తిస్తుంది. ఈ జాబితాలో మయూర్‌భంజ్, కెంజొహర్, సుందరగఢ్, బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజాం, గజపతి జిల్లాలు ఉన్నాయి.

భరత్‌పూర్ ఠాణా కేసుపై ఉత్కంఠ

భువనేశ్వర్: వివాదాస్పదంగా మారిన స్థానిక భరత్‌పూర్ ఠాణా విచారణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ సంఘటనపై ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో సైనిక అధికారి, అతని స్నేహితురాలు బాధితులు. వీరిని భరత్‌పూర్ ఠాణా అధికారి, సిబ్బంది అమానుషంగా వేధించి హింసించినట్లు ఆరోపణ. ఆరోపణ ఆధారంగా శుక్రవారం బాధిత వర్గంతో విచారణ బృందం సమావేశమైంది. అనంతరం క్రైం శాఖ అదనపు డైరెక్టరు జనరల్ ఏడీజీ బినయ్‌తోష్ మిశ్రా మీడియాతో స్పందించారు. నిందితుల వాంగ్మూలం నిజానిజాల నిర్ధారణ కోసం గుజరాత్‌లో లై డిటెక్షన్ పరీక్ష ప్రక్రియ పూర్తయ్యింది. భరత్‌పూర్ ఠాణా ఇన్‌స్పెక్టరు ఇన్‌చార్జి దీనకృష్ణ మిశ్రాకు నార్కో పరీక్ష, బ్రెయిన్ మ్యాపింగు నిర్వహించారు.

ఠాణాలో బాధితుల పట్ల జరిగిన వేధింపులను తీవ్రంగా పరిగణించి విచారణ లోతుగా కొనసాగిస్తామని ఏడీజీ వివరించారు. మరోవైపు ఏకసభ్య న్యాయ విచారణ ఆరంభమైంది. త్వరలో న్యాయ విచారణ కమిషన్‌కు లై డిటెక్షన్ నివేదిక దాఖలు చేయనున్నారు. ఈ మేరకు గుజరాత్ ఫోరెన్సిక్ వర్గాలకు సకాలంలో నివేదిక దాఖలు చేయాలని అభ్యర్థించారు. మరోవైపు చట్టపర నిబంధనల మేరకు బాధితుల వాంగ్మూలం నమోదు చేయనున్నట్లు ఏడీజీ పేర్కొన్నారు.

'ఉద్యోగాల కోసం పోరాటం చేస్తా'



వేదికపై యాక్షన్ కమిటీ సభ్యులు

కొరాపుట్: నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగాలు జిల్లాస్థాయిలో నియామకం కోసం పోరాటం చేస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని నిశ్నాహండి వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో కమిటీ సభ్యుడు అర్జున్ బోత్ర మాట్లాడారు. నాలుగో తరగతి, ఉపాధ్యాయ, అటవీ శాఖ విభాగాలలో స్థానిక నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్య పరిష్కారం కోసం అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు లోక్ సభ, ఒక రాజ్యసభ సభ్యుడు పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని కమిటీ పిలుపు నిచ్చింది. సమావేశంలో మున్నా త్రిపాఠి, రుపక్ తురుక్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంలోని అవయవాలు తీసేశారా..?



బబులా దిగ్గల్

భువనేశ్వర్: మృతదేహంలోని అవయవాలు దొంగతనం చేశారనే తీవ్ర ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ ఆరోపణల మేరకు పోలీసులు పాతిపెట్టిన శవాన్ని బయటకు తీసి పరీక్షల కోసం పంపించారు. వివరాల్లోకి వెళితే.. కంధమాల్ జిల్లా బలిగుడ ప్రాంతంలో బబులా దిగ్గల్ అనే వ్యక్తి 15వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురవ్వగా కటక్ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ 16వ తేదీన అతను చనిపోయాడు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే మృతదేహంపై అనుమానాస్పద కుట్లు ఉండడంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. బబులా చనిపోయాక అతని శరీరంలోని అవయవాలను తీసివేశారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బలిగుడ ఠాణాలో నమోదైన కేసు ఆధారంగా పోలీసులు శుక్రవారం నిందిత ఆస్పత్రిపై దాడి చేసి విచారణ ప్రారంభించారు. అవయవ చోరీ ఆరోపణపై ఆస్పత్రి వర్గాల్ని ప్రశ్నిస్తున్నారు. మృతదేహాన్ని కూడా వెలికి తీసి పరీక్షలకు పంపించారు. పోలీసుల విచారణ పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఆదిలోనే హంసపాదు



- శ్రీమందిరంలో కార్తీక వ్రతం ఏర్పాట్లలో లోపం
- సొమ్మసిల్లిన హబిష్యాలి



బృందావతి పూజల్లో హబిష్యాలీలు

భువనేశ్వర్: పవిత్ర కార్తీక మాసంలో పూరీ జగన్నాథుని దర్శనార్థం ప్రజలు పెద్ద సంఖ్యలో మందిరానికి తరలివస్తున్నారు. ప్రధానంగా ఈ నెల రోజులపాటు కార్తీక వ్రతం ఆచరించేందుకు హబిష్యాలీలు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. వీరి కోసం ప్రభుత్వం సకల సదుపాయాలతో ఉచిత సేవలు అందించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. కొత్త ప్రభుత్వం కూడా ఆ సేవలు కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. కానీ వాస్తవ కార్యాచరణకు వచ్చేసరికి మాత్రం కొత్త ఆంక్షలు జారీ చేసింది. దీంతో భక్తుల్లో కలకలం రేగింది. హబిష్యాలి శిబిరంలో తలదాచుకుంటూ కార్తీక వ్రతం ఆచరించేందుకు వచ్చిన ఒక వృద్ధ మహిళను అనుమతించలేదు. దీంతో ఆమె శిబిరం ఆవరణలో వరండాపై శుక్రవారం సొమ్మసిల్లారు.

కొత్త నిబంధనల వల్లనే..

జగన్నాథుని సన్నిధిలో నెల రోజుల పాటు కార్తీక వ్రతం ఆచరించే ఔత్సాహిక హబిష్యాలీలు ఉచిత సౌకర్యాలు, సేవల కోసం ముందస్తుగా ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ముందస్తుగా ప్రకటించింది. ఇలా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఉచిత సౌకర్యాలు పూర్తి స్థాయిలో లభిస్తాయని స్పష్టం చేసింది. కానీ సొమ్మసిల్లిన వృద్ధురాలు ముందస్తుగా తన వివరాలు నమోదు చేసుకోకపోవడంతో ఆమెకు వసతి సదుపాయం లభించలేదు. అయితే ఈ నిబంధనపై విపక్షాలు మండిపడుతున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు, వృద్ధులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవడం కుదరని పని అని, సౌకర్యాల ఏర్పాటులో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని విమర్శించారు. అయితే ఈ విషయాన్ని రాజకీయం చేయడం భావ్యం కాదని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ విచారం వ్యక్తం చేశారు.

దర్శనం క్రమబద్ధీకరణ

శ్రీమందిరంలో కార్తీక వ్రతం ఆరంభమైంది. ఈ నేపథ్యంలో శ్రీ మందిరంలో రత్న వేదికపై మూల విరాట్ల దర్శనంలో అసౌకర్యం తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కార్తీక మాసం రద్దీ నియంత్రణ చర్యల్లో భాగంగా శ్రీ మందిరం సింహ ద్వారం, పశ్చిమ ద్వారం గుండా మాత్రమే ప్రవేశానికి అనుమతించారు. అలాగే సింహ ద్వారం గుండా నిష్క్రమణ నివారించారు. ప్రవేశానికి 2 ద్వారాలు, బయటకు వచ్చేందుకు 3 ద్వారాల గుండా అనుమతించారు.

పంచవర్ణ శోభ

కార్తీక మాసం వ్రతం సందర్భంగా హబిష్యాలీ శిబిరాల ప్రాంగణాలు పంచవర్ణ శోభతో కళకళలాడుతున్నాయి. ఈ వ్రతంలో బృందావతిని పూజిస్తారు. వ్రతం ప్రాంగణంలో తులసి కోటని ఏర్పాటు చేసి నిత్యం పంచ వర్ణాల ముగ్గులతో అలంకరించి అర్చిస్తారు. పూరీ పట్టణంలో పంచ తీర్థాల్లో స్నానం ఆచరించి అత్యంత శుచి శుభ్రతతో వ్రతం నెల రోజులపాటు నిరవధికంగా వ్రతం కొనసాగిస్తారు.

నిత్యం దర్శనం

నెల రోజులపాటు కార్తీక వ్రతంలో భాగంగా శ్రీ మందిరంలో రత్న వేదికపై కొలువు దీరిన మూల విరాట్లను నిత్యం దర్శించుకుంటారు. కార్తీక మాసం పురస్కరించుకుని నెల రోజులపాటు రాధా దామోదర అలంకరణలో మూల విరాట్లను దర్శించుకుని తరిస్తారు. చివరగా కార్తీక పూర్ణిమ నాడు మూల విరాట్‌లు స్వర్ణ అలంకరణలో దర్శనం ఇస్తారు. పవిత్ర కార్తీక మాసంలో చివరి 5 రోజుల్ని పంచుకగా పరిగణిస్తారు. ఈ 5 రోజులు కొంగ సైతం చేపని తాకకుండా శాకాహారిగా తరిస్తుందని కథనం ప్రాచుర్యంలో ఉంది. పంచుక వ్యవధిలో శాకాహారంతో స్వామి దర్శనం నెల రోజుల మోక్షం ప్రసాదిస్తుందని నమ్ముతారు. దీనిని పంచుక వ్రతంగా కొనియాడతారు.



లక్ష్మీ నృసింహ అలంకరణ

రోజుకో అలంకరణ

పంచుక సందర్భంగా రోజుకో అలంకరణలో భక్తులకు స్వామి దర్శనం లభిస్తుంది. ఈ 5 రోజులు వరుస క్రమంలో ఠియాకియా, బంకొచూడా, డాలికియా, లక్ష్మీ నృసింహ, స్వర్ణ అలంకరణలో స్వామి శోభిల్లడం ఆచారం. ఈ ఏడాది పంచాంగం గణాంకం ప్రకారం 5 రోజుల పంచుక 4 రోజులకు పరిమితం అవుతుందని పండితులు ప్రకటించారు. ఒక రోజు కుదించుకు పోవడంతో ఈ ఏడాది పంచుక సందర్భంగా రత్న వేదికపై మూల విరాటుల లక్ష్మీ నృసింహ అలంకరణ దర్శనం లభించదు. పంచుకలో నాలుగో రోజున ఈ అలంకరణ జరగాల్సి ఉండగా చతుర్థి తిథి క్షయం కావడంతో లక్ష్మీ నృసింహ అలంకరణ నివారించినట్లు ప్రకటించారు.



● మర్యాదపూర్వక భేటీ

కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్ ఎస్.దేవదత్త సింగ్ స్థానిక రాజ్ భవన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. - భువనేశ్వర్

ఉద్యోగులకు సత్కారాలు



జిల్లా పరిషత్ హాల్‌లో సమపాన సంపూర్ణతా అభియాన్ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు జి.తిరుపతి రావు, డీఆర్‌డీఏ అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత మూడు నెలలుగా గుమ్మా, ఆర్.ఉదయగిరి సమితి కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు 'సంపూర్ణతా అభియాన్' వంద శాతం ప్రజలకు అందినట్టు కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తెలిపారు. దీనిపై స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సంపూర్ణతా అభియాన్ సమపాన ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా జెడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, అదనపు కార్య నిర్వాహక అధికారి పృథ్వీరాజ్ మండల్, జిల్లా ముఖ్య చికిత్సాధికారి డాక్టర్ మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలల్లో వ్యవసాయాభివృద్ధి, సామాజిక సంక్షేమం, సామాజిక వికాసానికి తగు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖల్లో పని చేస్తున్న ఆశా, అంగన్ వాడీ కార్యకర్తలకు సీడీఎంఓ డాక్టర్ అలీ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవ్యవసాయ అధికారి సురేంద్రనాథ్ స్వయిని, పరిమళ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజరు దేబబ్రత ఆచార్య, డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వర సాహు, నీతి ఆయోగ్ ప్రోగ్రాం లీడర్ సంజయ్ సాహు, బీడీఓలు, బ్లాక్‌స్థాయి శిక్షాధికారులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ హాల్‌లో సమపాన సంపూర్ణతా సమపాన అభియాన్‌లో ఆశావర్కర్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్



జిల్లా ఆరోగ్యశాఖ విభాగం అధికారికి ప్రశంసా పత్రం అందజేస్తున్న జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ అలీ

జయపురం ఔన్నత్యాన్ని చాటి చెబుదాం



వేదికపై ఎమ్మెల్యే బహిణీపతి తదితరులు

జయపురం: స్థానిక చారిత్రక కట్టడాలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుందామని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బహిణీపతి పిలుపునిచ్చారు. కుమార పూర్ణిమ ఉత్సవం సందర్భంగా గురువారం రాత్రి స్థానిక రాజభవన్ కూడలి వద్ద నిర్వహించిన కుమార ఉత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జయపురం చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బహిణీపతి మాట్లాడుతూ జయపురం ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన సమయం వచ్చిందని అన్నారు. జయపురంలో కుమార పూర్ణిమ ఉత్సవం 1973లో ఆనాటి సబ్ కలెక్టర్ సుభాష్ పాణి ప్రారంభించారని, ఆనాటి నుంచి జయపురంలో ఉత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఉత్సవంలో జయపురం కళా కేంద్ర ప్రారంభకులు గురు కనూచరణ ప్రధాన్, ప్రేరణ డ్యాన్స్ అకాడమి వ్యవస్థాపకుడు సస్మిత రథ్, మీరా డ్యాన్స్ గ్రూపు వ్యవస్థాపకులు పంచానన మిశ్రాలను సత్కరించారు.



జ్యోతిని వెలిగిస్తూ కుమార ఉత్సవాలను ప్రారంభించిన చైర్మన్ నరేంద్ర కుమార్

నిషూ పటిష్టం





- ప్రయాణికుల రైళ్లలో బాణాసంచా నిషేధం
- తీసుకెళ్తే చర్యలు తప్పవు

భువనేశ్వర్: దీపావళి పండగను పురస్కరించుకుని రైళ్లలో ప్రత్యేక తనిఖీలు ముమ్మరం చేసినట్లు తూర్పు కోస్తా రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రయాణికుల రైళ్లలో బాణసంచా వంటి పేలుడు, అగ్ని కారక, ప్రమాదకర సామగ్రి రవాణా పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ జోన్ పరిధిలో ఖుర్దారోడ్, సంబలపూర్ మరియు వాల్తేరు మండలాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టేందుకు యంత్రాంగం సిద్ధం చేశారు.

భద్రత కోసం సమాచారం

రైలులో ప్రయాణ భద్రత కోసం బాణసంచా వంటి ప్రమాదకర సామగ్రి రవాణాపై తక్షణ సమాచారం అందజేయడంలో తోటి ప్రయాణికులు చైతన్యవంతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సంబంధించిన సమాచారం 139 నంబరు ద్వారా తెలియజేయాలని సూచించారు.

అగ్నిమాపక వ్యవస్థ

రైల్వే ప్రాంగణాల్లో అగ్ని మాపక వ్యవస్థ అందుబాటులో ఉంచారు. ప్రధానంగా ప్లాట్‌ఫారం, గూడ్స్ షెడ్, గార్డు వ్యాన్, ఏసీ కోచ్‌లు, ప్యాంట్రీ కారు ప్రాంగణాల్లో ఈ సరంజామా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

నిషూ పటిష్టం

రైళ్లలో బాణసంచా రవాణా నివారణపై నిఘా పటిష్టం చేశారు. రైల్వే రక్షక దళంతో సివిల్ డిఫెన్సు, ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ), సహేలి బృందాలు ప్రయాణికులతో బాణాసంచా రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు.

ప్రత్యేక స్క్వాడ్

రైళ్లలో బాణసంచా రవాణా చేయకుండా ప్రత్యేక స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుంది. ప్రయాణికుల్ని ఈ మేరకు చైతన్యపరిచేందుకు రైల్వే ప్లాట్‌ఫారాలపై ప్రత్యేక ప్రకటనలు ప్రసారం చేస్తున్నారు. సరుకు బుకింగ్ సందర్భంగా ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి అప్రమత్తం చేశారు.

కుప్పకూలిన పూజా మండపం



కుప్పకూలిన పూజా పందిరి



పందిరి కింద చిక్కుకున్న మినీ ట్రక్కు

భువనేశ్వర్: దుర్గా పూజలు ముగిసిన తర్వాత ఊహాతీతమైన ప్రమాదం సంభవించింది. కటక్ ఖాన్‌నగర్ ప్రాంతంలో దుర్గా పూజ కోసం ఏర్పాటు చేసిన నిలువెత్తు పూజా పందిరి (మండపం) నిలువునా కుప్పకూలింది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నేతాజీ బస్సు టెర్మినల్ పరిసర జన సందోహిత ప్రాంతంలో భారీ స్థాయి పూజా పందిరి అకస్మాతుగా నేలకొరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాతు ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణ హాని సంభవించ లేదు. పందిరి కింద పలు వాహనాలు చిక్కుకుని ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం.

పందిరి ఏర్పాటులో లోపంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. జేసీబీ సహాయంతో కుప్పకూలిన పందిరిని తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రైలు నుంచి జారిపడి తల్లీకుమార్తెకు గాయాలు



గాయపడిన రీతిక చందన్

రాయగడ: కదులుతున్న రైలును ఎక్కుతుండగా జారిపడిన ఘటనలో తల్లీకుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన రాయగడ జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ పరిధి సింగపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకోగా.. తల్లి రీతిక చందన్, కూతురు హసీన చందన్ గాయపడ్డారు. సమచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం .. టిట్లాఘఢ్‌కు చెందిన వీరిద్దరు పెంట పంచాయతీలోని జంజిలిబడి గ్రామంలోని బంధువుల పెద్దకర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు శుక్రవారం తెల్లవారుజామున స్టేషన్‌కు వచ్చారు. ఇంతలో కోర్బ నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు సింగపూర్ స్టేషన్‌లో కొంత సేపు ఆగింది. ఈ సమయంలో రీతిక చందన తన నాలుగేళ్ల కూతురు హసీనను పట్టుకుని కదులుతున్న రైలును ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయారు. దీంతో రీతికకు రెండు కాళ్లు, కుడి చేయి తెగిపోగా.. కూతురు హసీనకు కుడి చెయ్యి తెగిపోయింది. తీవ్ర గాయాలకు గురైన వీరిని స్థానిక ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలించారు.



హసీన చందన్

క్లుప్తంగా

శ్రీ మందిరం సూపర్‌వైజర్‌పై దాడి

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో సీనియర్ సూపరువైజర్‌పై శుక్రవారం దాడి జరిగింది. నిందితులపై కఠిన చర్యలు చేపడతామని ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరబిందు కుమార్ పాఢి తెలిపారు. శ్రీ మందిరంలో సీనియర్ సూపరువైజర్, సేవాయత్‌పై అనధికారిక వ్యక్తి దాడి చేసినట్లు ఆరోపణ. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో సేవాయత్, సూపరువైజర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఆనంద బజారు ప్రాంగణంలో రబిడి విక్రయం కోసం ఇరు వర్గాల మధ్య ప్రారంభమైన వాగ్యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుందని ప్రత్యక్ష సాక్షుల కథనం.

ముగిసిన నందెన్న ఉత్సవాలు


నిమజ్జనోత్సవంలో చిన్నారులు

రాయగడ: స్థానిక జగన్నాథ మందిరం సమీపంలో కంద్రవీధిలో పదకొండు రోజులుగా నిర్వహిస్తున్న నందెన్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. అనంతరం జంఝావతి నదిలో నిమజ్జనం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కుమార్తెను చంపిన తండ్రి అరెస్టు


సంజీవ్ భత్ర

మల్కన్‌గిరి : చిత్రకొండ సమితి ఆర్ఎస్‌సీ 14 గ్రామంలో కన్న కూతుర్ని చంపి పరారైన సంజీవ్ భత్రను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రెండో భార్య మాటలు విని ఐదేళ్ల కుమార్తెను సంజీవ్ బుధవారం హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితుడు గుంటబేడ పంచాయతీ గొడిగూఢ అటవీ ప్రాంతం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పారిపోతుండగా చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్కా పట్టుకున్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అధ్యాపకునిగా డొంగొరియా కొంధొ అభ్యర్థి ఉత్తీర్ణత

● ముఖ్యమంత్రి అభినందనలు


అజయ్ కుమార్ కద్రకా

భువనేశ్వర్: ఆదిమ దళిత డొంగొరియా కొంధొ జాతి అభ్యర్థి అజయ్ కుమార్ కద్రకా యూజీసీ-ఎన్‌ఈటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రొఫెసరు ఉద్యోగానికి అర్హత సాధించడం విశేషం. ఈ ఉత్తీర్ణతపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజలందరికీ గర్వకారణమని కొనియాడారు. కంధమల్ జిల్లా ఖంబేషి గ్రామానికి చెందిన అజయ్ కుమార్ కద్రకా కోటగడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించి తదుపరి ఉన్నత విద్యాభ్యాసం స్థానిక కిస్ కళాశాలలో కొనసాగించాడు.

జయపురం మున్సిపాలిటీ అదనపు కార్యనిర్వాహక అధికారిగా కతిబాస సాహు

జయపురం: జయపురం మున్సిపాలిటీ నూతన అదనపు కార్యనిర్వాహ క అధికారిగా కతిబాస సాహు శుక్రవారం బాధ్యతలు స్వీకరించా రు. తన జాయినింగ్ రిపోర్టును కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్‌కు అందజేశారు. సాహుకు సిద్ధార్థ పట్నాయిక్, చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి మున్సిపాలిటీ సిబ్బంది స్వాగతం పలికారు. ఆయన 2021లో ఒడిశా మున్సిపాలిటీ అడ్మిని స్ట్రేషన్ సర్వీసు పాసయ్యారు. శిక్షణ పొందిన అనంతరం జయపురం మున్సిపాలిటీలో అదనపు కార్యనిర్వాహక అధికారిగా చేరారు.

నాటుసారా స్వాధీనం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి మెండుఖలి గ్రామ సమీప అడవిలో నాటుసారా


పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా సామగ్రి

తయారు చేస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో మత్తిలి ఎక్సైజ్ అధికారి హేమంత్ కుమార్ బాగ్ తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. దీనిలో భాగంగా 260 లీటర్ల ఊట, 1,800 కేజీల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన సారా తయారు చేస్తున్న వ్యక్తులు పరారయ్యారు.

అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం: జిల్లా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో ఒప్పంద(కాంట్రాక్టు), పొరుగుసేవలు(ఔట్ సోర్సింగ్) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో తెలియజేయవచ్చని డీఈఓ శుక్రవారం తెలిపారు.

రైల్వే రిజర్వేషన్ వ్యవధి కుదింపు

● 60 రోజులు ముందుగా మాత్రమే రిజర్వేషన్



భువనేశ్వర్: రైలు ప్రయాణం కోసం ముందస్తు రిజర్వేషన్ వ్యవధిని కుదించారు. ఈ ఏడాది నవంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త నిబంధన అమలవుతుంది. ఈ నిబంధన ప్రకారం రైలు ప్రయాణం కోసం 60 రోజులు ముందుగా మాత్రమే రిజర్వేషన్ చేసుకోగలుగుతారు. ప్రస్తుతం 120 రోజులు ముందుగా రిజర్వేషన్ చేసుకునే నిబంధన అమలవుతోంది.

తరచూ మార్పులు

ప్రయాణికుల సౌకర్యం దృష్ట్యా రైల్వే శాఖ తరచూ రిజర్వేషను వ్యవధిలో మార్పు చేర్పులు చేయడం ఆనవాయితీగా వస్తోంది. 1980 దశకం నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 30 రోజుల నుంచి 120 రోజులు ముందుగా రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంలో పలుమార్లు మార్పులు చోటు చేసుకున్నాయి. 1995 సంవత్సరం సెప్టెంబర్ 1 నుంచి 1998 సంవత్సరం జనవరి 31వ తేదీ వరకు సుమారు 3 సంవత్సరాలపాటు 30 రోజుల ముందస్తు రిజర్వేషన్ విధానం కొనసాగింది. 45 రోజుల ముందస్తు రిజర్వేషను సౌకర్యం 1993 సంవత్సరం అక్టోబరు 1 నుంచి 1995 సంవత్సరం జూన్ నెలాఖరు వరకు కొనసాగింది.

రద్దుకు చెక్

దీర్ఘకాలిక ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం పలువురు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ప్రయాణానికి 120 రోజులు ముందస్తు రిజర్వేషను వ్యవస్థ అవాంఛనీయ పరిస్థితులను ప్రేరేపిస్తుంది. 4 నెలల ముందుగా రిజర్వేషన్ చేసుకున్న వారిలో పలువురు ప్రయాణం రద్దు చేసుకునే దాఖలాలు పెరుగుతున్నాయి. ఈ వర్గంలో పలువురు ప్రయాణం రద్దు చేసుకున్నా, రిజర్వు టికెట్లు రద్దు చేసుకోని పరిస్థితుల్లో రైలులో బెర్తులు నిరుపయోగమై అవసరమైన వారికి చోటు దక్కక ఇక్కట్లు పాలవుతున్నారు. స్వల్ప కాలిక ముందస్తు రిజర్వేషను ఈ ఇబ్బందిని తొలగించి అవసరమైన వారికి సకాలంలో రైలులో సుఖమయ ప్రయాణానికి దోహదపడుతుందని రైల్వే శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుత గణాంకాల ప్రకారం సుమారు 21 శాతం రిజర్వేషను టికెట్లు రద్దు అవుతున్నాయి. 4 నుంచి 5 శాతం వరకు రిజర్వు చేసుకున్న ప్రయాణికులు ఎటువంటి సమాచారం లేకుండా ప్రయాణం రద్దు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో అవసరమైన ప్రయాణికులకు రైళ్లలో సీట్లు లభించక రిజర్వేషను వ్యవస్థ లబ్ధి నీరుగారుతోందని రైల్వే శాఖ గుర్తించింది.

సెల్‌ఫోన్ పగలుగొట్టిన నర్సు

● రోగి బంధువుల ఆందోళన


పగిలిన సెల్‌ఫోన్ చూపిస్తున్న రాజా

మల్కన్‌గిరి: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రోగితో వచ్చిన బంధువు సెల్‌ఫోన్‌ను నర్సు పగలుగొట్టిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మల్కన్‌గిరి మున్సిపాలిటీ కాలనీకి చెందిన రాజా బాగ్ తన చెల్లెలు అంజు బాగ్‌కు కడుపు నొప్పి రావడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే అక్కడ వైద్యురాలు ఆమెను నాలుగో ఫ్లోర్‌కు తీసుకెళ్లి జాయిన్ చేయమని సూచించారు. దీంతో అక్కడికి వారు వెళ్లి నర్సుకు విషయం చెప్పినా ఆమె పట్టించుకోలేదు. ఆ సమయంలో ఆమె సెల్‌ఫోన్ చూస్తూ ఉండడంతో రాజా బాగ్ ఆమెను వీడియో తీయడం ప్రారంభించాడు. దీంతో ఆమె వెంటనే అతడి సెల్‌ఫోన్ తీసుకొని నేలకేసి కొట్టింది. ఫలితంగా సెల్‌ఫోన్ పగిలిపోవడంతో రోగి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే రాజా మరో వ్యక్తితో కలిసి జిల్లా వైద్యాధికారులకు నర్సుపై ఫిర్యాదు చేశారు. వైద్యాధికారి ధనేశ్వర్ మహా పాత్రో మాట్లాడుతూ పూర్తి విచారణ తర్వాత నర్సు తప్పు ఉంటే ఆమెపై చర్యలు తీసుకుంటామన్నారు.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సమావేశం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ అడవ గ్రామం పదగాం శివమందిరం వద్ద శుక్రవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సభ్యులు సమావేశమయ్యారు. వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ భవిష్యత్ ప్రణాళికలో భాగంగా నవంబరు 3న మోహనా సరస్వతీ శిశు మందిర్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానించారు. పర్లాకిమిడి, బరంపురం ఎంకేసీజీ మెడికల్‌లో పేషెంట్లకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం దృష్ట్యా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని వీహెచ్‌పీ జిల్లా నాయకులు గొడో తీర్మానించారు. ఈ సమావేశంలో మోహన, చంద్రగిరి, అడవ గ్రామం భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ సభ్యులు ముందుకు రావాలని కోరారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు


అరెస్టైన నిందితుడు విధన్


మిలాన్ మృతదేహం (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎంవీ 8 గ్రామంలో సోమవారం రాత్రి మిలాన్ ముజూంధర్ అనే వ్యక్తిని హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మిలన్ భార్య సుమిత్ర ముజూంధర్ మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి ఎంవీ 7 గ్రామానికి చెందిన విధన్ మండాల్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. మల్కన్‌గిరి ఎస్డీపీవో సచిన్ పటేల్ తెలిపిన వివరాల మేరకు.. ఇరుగుపొరుగు గ్రామాలకు చెందిన విధన్ మండాల్, మిలన్ ముజూంధర్‌లు స్నేహితులు. దీనిలో భాగంగా 15 రోజుల క్రితం ఇద్దరూ కలిసి మద్య సేవించే సమయంలో మిలాన్ ముజూంధర్ విధన్ భార్య కోసం తప్పుగా మాట్లాడాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటినుంచే మిలాన్‌ను చంపాలని చూస్తున్న విధన్ సోమవారం మద్యం తాగేందుకు పిలిచాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో వెనుక నుంచి కత్తితో మెడపై వేటువేశాడు. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి చనిపోయాడు. అనంతరం మిలాన్ ఒంటిపై ఉన్న బంగారం, సెల్‌ఫోన్, డబ్బులు తీసుకొని విధన్ పరారయ్యాడు. అయితే కేసు విచారణ సమయంలో వీరి స్నేహం గురించి తెలుసుకొని ఆరా తీసి విచారణ చేయగా విషయం బయటకొచ్చిందన్నారు. విచారణ అనంతరం శనివారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

గంజాయితో పట్టుబడిన యువకులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని విజయాదిత్య పార్కు వద్ద శుక్రవారం కిలో గంజాయితో నలుగురు యువకులు రెండో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ఒకరు మైనర్. నగరానికి చెందిన తుపాకుల సువార్తరాజు, సీరపు కౌశిక్, ఓ మైనర్, విశాఖపట్నానికి చెందిన ఎ.సాయిషణ్ముఖతో కలిసి విజయాదిత్య పార్కు వద్ద తచ్చాడుతుండటంతో పోలీసులు అనుమానంతో పట్టుకున్నారు. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేయగా.. సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

బాబోయ్ కొండచిలువ


బాలాజీ మందిర ప్రాంతంలో పట్టుబడిన కొండ చిలువ

జయపురం: స్థానిక కుంభారి వీధిలో గల బాలాజీ మందిరం ప్రాంతంలో శుక్రవారం 12 అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. భారీ సర్పాన్ని చూసిన స్థానికులు అటవీ శాఖాధికారులకు తెలియజేయగా.. వారు వెంటనే స్నేక్ హెల్ప్‌లైన్‌కు తెలియజేసి కొండ చిలువను పట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్నేక్ లైన్ కృష్ణ కేశవ షాడంగి, రవీంద్ర రవుత్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులు బాలాజీ మందిరానికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నారు. కొండ చిలువ 12 అడుగుల పొడవు ఉందని, దాని బరువు 12 కిలోలు ఉంటుందని స్నేక్‌లైన్ సీనియర్ సభ్యుడు కృష్ణ కేశవ షాడంగి వెల్లడించారు. పాముకి వైద్య పరీక్షలు జరిపిన అనంతరం అడవిలో సురక్షిత ప్రాంతంలో విడిచి పెట్టనున్నట్లు షాడంగి వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గజలక్ష్మి అమ్మవారికి పూజలు


రాయగడ: అమ్మవారి భోగం కొనుగోలుకు బారులుతీరిన భక్తులు


పర్లాకిమిడి: ఒడ్డిమంగళవీధిలో కొలువుదీరిన గజలక్ష్మీదేవి

రాయగడ: స్థానిక న్యూకాలనీలోని గజలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి భోగం ఖరీదు చేసేందుకు భక్తులు బారులు తీరారు. ఏటా అమ్మవారి ప్రసాదంగా నిర్వాహకులు అన్న భోగాన్ని విక్రయిస్తుంటారు. దీనిని సేవిస్తే అమ్మవారి కరుణ, కటాక్షాలు దక్కుతాయని భావించిన భక్తులు ఈ ప్రసాదం కొనుగోలుకు ఎగబడుతుంటారు. 11 రోజులు జరిగే అమ్మవారి పూజల్లో పది రోజులు ప్రసాదం విక్రయిస్తుంటారు. ఈ ఏడాది అమ్మవారి భోగాన్ని 40 రుపాయలకే నిర్వాహకులు విక్రయిస్తున్నారు.

పర్లాకిమిడిలో..

సిరుల తల్లి గజలక్ష్మి పూజలు పర్లాకిమిడిలో ప్రారంభమయ్యాయి. దసరా వేడుకలు ముగిసిన తరువాత పట్టణంలో గాంధీ జంక్షన్ వద్ద పౌర్ణమి రాత్రి పూజలు చేసి గజలక్ష్మిదేవికి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు స్థానికులను ఆకర్షిస్తున్నాయి. 11 రోజులు పర్లాకిమిడిలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాదం విక్రయం, సేవనం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నందపూర్‌లో మంచినీటి ఇక్కట్లు


పైపులు పగిలిపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


పైపులైన్ ద్వారా సన్నగా వస్తున్న నీరు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నందపూర్ పట్టణంలో మంచినీటి ఇబ్బందులు కొనసాగుతున్నాయి. పలు వీధులలో పైప్‌లైన్ల నుంచి తగినంత నీటి సరఫరా జరగడం లేదు. పలుచోట్ల పైపులు పగిలి పోవడంతో నీటి సరఫరా సక్రమంగా సాగడం లేదు. దీంతో నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నటుడు బుద్ధాదిత్య మహంతికి వ్యతిరేకంగా ఫిర్యాదు


బుద్ధాదిత్య మహంతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న యువజన కాంగ్రెస్ ప్రతినిధులు

భువనేశ్వర్: ఒడియా చలన చిత్ర నటుడు బుద్ధాదిత్య మహంతికి వ్యతిరేకంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు స్థానిక క్యాపిటల్ ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఉగ్రవాద కార్యకలాపాలతో ఆయనకు సంబంధం ఉన్నట్లు ఫిర్యాదులో ఆరోపించారు. తక్షణమే అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆయన ఫేసుబుక్ ఖాతాలో త్వరలో రాహుల్ గాంధీ హత్య జరగనుందని ముందస్తుగా సందేశం పంపించిన నేపథ్యంలో నటుడుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మురుగునీటిలో మృతదేహం

టెక్కలి రూరల్: టెక్కలిలోని మండపాలం కాలనీ-4వ లైన్‌లో ఖాళీగా ఉన్న పునాదుల మురుగు నీటిలో శుక్రవారం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు భూలోకమాత వీధికి చెందిన బాదా రిషికేశ్(43)గా గుర్తించారు. మద్యం మత్తులో ఇటుగా వచ్చి ప్రమాదానికి గురై ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. అంతకుముందు రిషికేశ్ మృతిచెందిన విషయం తెలియడంతో కొందరు స్థానికులు మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేస్తుండగా.. పోలీసులు రావడంతో అక్కడే వదిలి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యా పిల్లలు లేకపోవడంతో.. తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసునమోదు చేశారు. కాగా, రిషికేష్ నిత్యం పేకాడుతుంటాడని, దానిలో భాగంగా దసరాకు పూలు అమ్మి సంపాదించిన డబ్బులతో గురువారం రాత్రి బ్రాహ్మణవీధి సమీపంలో పేకాట ఆడుతుండగా పోలీసులు వస్తున్నారనే సమాచారంతో పరుగున వెళ్తూ ప్రమాదవశాత్తు ఆ పునాదుల్లో పడిపోయి, బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందాడని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల సుడిగాలి పర్యటనలు


బందుగాంలో కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే పవిత్ర శాంత


నందపూర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం

కొరాపుట్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సొంత నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. శుక్రవారం సీఎల్పీ నాయకుడు రాంచంద్ర ఖడం తన నియోజకవర్గం పొట్టంగిలోని నందపూర్ సమితి పంతులుగాంలో వాల్మీకి ఆశ్రమం సందర్శించారు. ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముక్తి అంబ వద్ద రాజా గుహని పర్యాటక రంగంలో అభివృద్ధి చేస్తామన్నారు. మరోవైపు లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత బందుగాం, అలమండ, కప్పలాడ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో సమస్యలను బీడీవోకి తెలియజేశారు.

రణస్థలంలో ప్రొటోకాల్ రగడ


సభ్యులకు సర్దిచెబుతున్న పోలీసులు

రణస్థలం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ప్రొటోకాల్‌పై ప్రజా ప్రతినిధులు తీవ్రస్థాయిలో దూషణలకు పాల్పడటంతో గందరగోళం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి రజని అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కోరం ఇంకా రానందున పాత ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తిని సన్మానించేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో రణస్థలం టీడీపీ సర్పంచ్ లేచి ప్రొటోకాల్ ఎవరూ పాటించడం లేదని, సమావేశానికి ఆహ్వానం అందించలేదని విమర్శించారు. దీనిపై రణస్థలం ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి రమేష్ మాట్లాడుతూ సన్మాన సమావేశానికి ప్రొటోకాల్ అవసరం లేదని చెప్పగా.. సర్పంచ్ పిన్నింటి భాను మాట్లాడుతూ ప్రొటోకాల్ లేని వ్యక్తులు సమావేశానికి వచ్చి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఒకరినొకరు నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంటూ సమావేశాన్ని రసాభాసగా మార్చారు. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం ఎస్సై చిరంజీవి, సిబ్బంది ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఎంపీడీవో ఈశ్వరరావు చొరవ తీసుకుని.. కోరం లేదని సన్మాన కార్యక్రమం పెట్టామని, అందరికి ఒకేలా ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ సమావేశానికి వచ్చి వ్యక్తులు మర్యాద పాటించాలని, అందరూ ఒకటేనని, గత సమావేశంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ వచ్చినప్పుడు ఎంతోమంది ప్రొటోకాల్ లేని బయట వ్యక్తులు వచ్చారని గుర్తుచేశారు. ప్రజా ప్రతినిధులు గౌరవం నిలబెట్టుకోవాలని సూచించారు. అనంతరం పలు శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులపై మాట్లాడారు.

పోలీస్‌స్టేషన్ వెనుక చోరీ


తెరిచి ఉన్న బీరువా

టెక్కలి: టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు వెనుక ఎన్టీఆర్ కాలనీ 5వ లైన్‌లో ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరగడం కలకలం రేపింది. గత ఏడాది కూడా అదే వీధిలో ఓ ఇంట్లో ఇదే తరహాలో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ కాలనీ ఐదో లైన్‌లో వైదా విశ్వేశ్వరరావు, యమున దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. విశ్వేశ్వరరావు శ్రీకాకుళంలో ఓ సంస్థలో పనిచేస్తుండగా.. యమున జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జీడీఏగా పనిచేస్తున్నారు. పిల్లల్ని తెలిసిన వారి ఇంటి వద్ద ఉంచి ఇద్దరూ గురువారం రాత్రి విధులకు వెళ్లారు. శుక్రవారం ఉదయం మేడపైన ఉన్న ఇంటి యజమాని యమునకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, ఏదో అనుమానంగా ఉందంటూ సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె ఇంటికి చేరుకోగా.. తాళాలను పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి సామగ్రి చిందర వందరగా పడి ఉండటం చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇటీవల కన్నవారింటి నుంచి తెచ్చుకున్న 20 తులాల బంగారం, తాము దాచుకున్న రూ.60 వేల నగదు పోయినట్లు లబోదిబోమన్నారు. భర్త ఇంటికి చేరుకున్నాక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రఘునాథరావు, క్రైమ్ సిబ్బంది ఇంటి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. వారి పరిశీలనలో 3 తులాల నెక్లెస్, రూ.60 వేల నగదు చోరీకి గురికాగా, మిగిలిన బంగారం బీరువాలోనే ఉండడంతో బాధితులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇటీవల వరుసగా దొంగతనాలు జరగడం స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

పైడితల్లి తెప్పోత్సవానికి ఏర్పాట్లు


హంస వాహనానికి రంగులు

విజయనగరం టౌన్: సిరులతల్లి సిరిమానోత్సవం పూర్తయిన మరుసటి మంగళవారం పెద్ద చెరువులో నిర్వహించ తలపెట్టిన తెప్పోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం స్థానిక సున్నంబట్టీ వీధి నుంచి పెద్దచెరువు వద్దకు అధికారులు చేరుకుని అక్కడ ప్రత్యేక గదిలో భద్రపరిచిన తెప్పకు సంబంధించిన వస్తువులన్నింటిని బయటకు తీయించి, వాటిని పర్యవేక్షించారు. అమ్మవారి తెప్పోత్సవానికి ఎటువంటి ఆటం కాల్లేకుండా చూస్తున్నారు. ముందస్తుగా పెయింటింగ్‌లు, డ్రమ్ముల పనితీరు, ఐరెన్ తదితర వాటిపై ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెండురోజుల్లో తెప్పోత్సవం ట్రయల్ రన్ వేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులైన టీచర్లకు ఓటు హక్కు కల్పించండి

- జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత


మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, డీఈఓ ప్రేమ్‌కుమార్

విజయనగరం అర్బన్: జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులందరికీ ఓటు హక్కు కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత కోరారు. దీనికోసం విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ సమావేశం మందిరంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈ సందర్భంగా వివరించారు. నవంబర్ 6లోగా ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులను స్వీకరించాలని ఆమె సూచించారు. నవంబర్ 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. సమావేశంలో డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్, ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ, డీవీఈఓ భీమశంకర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, ఇతర అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పీటీసీ ప్రిన్సిపాల్


రామచంద్రరాజు


విజయనగరం క్రైమ్: పోలీసు శిక్షణా కళాశాల (పీటీసీ) ప్రిన్సిపాల్‌గా డి.రామచంద్రరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పల్నాడు అడిషనల్ ఎస్పీగా పని చేస్తూ పదోన్నతిపై విజయనగరం పీటీసీ ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన పీటీసీ అభివృద్ధిని కొనసాగిస్తూ, రాష్ట్రంలో మంచి శిక్షణా కళాశాలగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సోషల్ మీడియా, క్రైమ్‌పై సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. క్రిమినల్ చట్టాలపై పోలీస్ సిబ్బంది అందరికీ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అవుడోర్ సిబ్బంది ఇచ్చిన గార్డ్ ఆఫ్ హానర్‌ను స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పివి.అప్పారావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ కోచ్‌ల శిక్షణ శిబిరానికి శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

శృంగవరపుకోట: విజయనగరం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థలో పే అండ్ ప్లే బ్యాడ్మింటన్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న గుంట్రోతు శ్రీనివాసరావు భారత్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ నిర్వహిస్తున్న భారత్ కోచెస్ శిక్షణకు ఎంపికయ్యారు. దీంతో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్, ధర్మవరం జెడ్పీ హైస్కూల్ పీడీ పి.శ్రీరాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 29 వరకూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజధాని రాయపూర్‌లో భారత్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహిస్తున్న భారత్ కోచ్‌ల శిక్షణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ శ్రీనివాసరావును ఎంపిక చేసినట్లు చెప్పారు.


నెల్లిమర్లలో పంప్‌హౌస్


డయేరియా సోకిన గుర్ల గ్రామం

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- వారం రోజులుగా గుర్లలో విజృంభిస్తున్న డయేరియా
- ఇప్పటి వరకు 9 మంది మృతి, 450 మందికి పైగా బాధితులు
- స్వచ్ఛంద కర్ఫ్యూను తలపిస్తున్న గుర్ల
- పేదల కుటుంబాల్లో నెలకొన్న విషాదం
- వారం రోజులు కావస్తున్నా సర్వే చేయడంలో నిర్లక్ష్యం
- డయేరియా ప్రబలడానికి కారణాలు తెలుసుకోలేని దుస్థితి
- కనిపిస్తున్న వలంటీర్ వ్యవస్థ లేని లోటు
- సమన్వయ లోపం.. పొంతనలేని ప్రకటనలు
- రాష్ట్ర మంత్రి వచ్చి వెళ్లినా ప్రయోజనం శూన్యం


గుర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ బెంచీలపై చికిత్స పొందుతున్న రోగులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/చీపురుపల్లి/గుర్ల:

ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం అదే ప్రాణాలతో చెలగాటమాడుతోంది. అధికారులను సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా చూసుకోవాల్సిన సర్కారు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోంది. గుర్ల మండలాన్ని వారం రోజులుగా డయేరియా వ్యాధి పట్టి పీడిస్తున్నప్పటికీ దాదాపు పదుల సంఖ్యలో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా, 450 మంది వరకు మంచాన పట్టినప్పటికీ ప్రభుత్వంలోగానీ, అధికారుల్లోగానీ ఎలాంటి చలనం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలినప్పటి నుంచి ఇంతవరకు డయేరియా లక్షణాలతో ఎనిమిది మంది, మనస్తాపంతో ఒకరు మృతి చెందారు. 450 మంది వరకు డయేరియా చికిత్స పొందుతున్నారు. ఇంత జరుగుతున్నా.. అసలు డయేరియా వ్యాధి ప్రబలడానికి కారణాలు ఏమిటి, ఏ రకంగా డయేరియా వ్యాధిని అదుపులోకి తీసుకురావాలి, 450 మంది మాత్రమేనా ఇంకా వ్యాధి లక్షణాలతో ఇళ్లల్లో ఎంత మంది బాధపడుతున్నారు అనే అంశాలపై ఇప్పటికీ యంత్రాంగం వద్ద స్పష్టత లేదనే చెప్పుకోవాలి.

మరో ఇద్దరి మృతి..

డయేరియా లక్షణాలతో ఇంతవరకు ఏడుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. శుక్రవారం గుర్ల గ్రామానికి చెందిన పతివాడ సూరమ్మ డయేరియా లక్షణాలతో ఇంటి వద్దనే చికిత్స పొందుతూ మరణించింది. అంతేకాకుండా ఈ నెల 14న మృతి చెందిన కలిశెట్టి సీతమ్మ కుమారుడు కలిశెట్టి రవి గత నాలుగు రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురై తల్లి లేదనే ఆవేదనకు గురై శుక్రవారం ఉదయం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది.

కనిపిస్తున్న వలంటీర్ వ్యవస్థ లేని లోటు

ఇదిలా ఉండగా గుర్లలో డయేరియా వ్యాధి విజృంభణ ప్రారంభమై వారం రోజులు కావస్తోంది. ఇంతవరకు ఆస్పత్రికి వస్తున్న వారే తప్ప ఇళ్లల్లో మరెంత మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో, ప్రైవేటు ఆస్పత్రులను ఎంతమంది ఆశ్రయిస్తున్నారో యంత్రాంగం వద్ద లెక్కలు లేవు. ఎనిమిది మంది మరణిస్తే తప్ప ఇంటింటికి సర్వే చేయాలనే ఆలోచన యంత్రాంగానికి రాకపోవడం శోచనీయం. డయేరియా వ్యాధి ప్రబలి ఎనిమిది మంది మృతి చెంది, 450 మంది వరకు ఆ లక్షణాలతో బాధపడుతున్న సమయంలో శుక్రవారం గుర్ల వచ్చిన కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇంటింట సర్వే నిర్వహించారు. ఈ సమయంలో గ్రామంలో అందరికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ గుర్తొచ్చింది. ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారిని సైతం ఎదురించి ప్రజల కోసం నిలబడిన వలంటీర్ వ్యవస్థ ఇలాంటి సమయాల్లో ఎంత అవసరమో స్పష్టమైంది.



డయేరియా ప్రబలడానికి చంపావతి నది నుంచి వచ్చిన తాగునీరే కారణమని ఒకరు, కాదు ఊరిలో ఉన్న ప్రైవేటు బోర్లు కలుషితమవ్వడంతోనే ఇలా జరిగిందని మరొకరు, కాదు కాదు చంపావతి నీరే కారణమని ఇంకొకరు ఇలా ఎవరికి నచ్చిన ప్రకటనలు వారు ఇచ్చుకుంటూ కాలం గడుపుతున్నారు తప్ప ప్రజలకు స్పష్టత ఇవ్వడం లేదు.

పేద కుటుంబాల్లో విషాదం

డయేరియా మహమ్మారి విజృంభణకు ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఎనిమిది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఒకే ఇంటిలో డయేరియాతో తల్లి మృతి చెందగా, తల్లి లేదన్న విషయాన్ని జీర్ణించుకోలేక కొడుకు ప్రాణాలు వదిలాడు. ఇలా ఎంతో మంది పేదల కుటుంబాల్లో డయేరియా విషాదాన్ని మిగుల్చుతోంది. గురువారం సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గ్రామానికి వచ్చి ప్రజలకు భరోసా కల్పించిన తరువాత మరో ఇద్దరు మృతి చెందడంతో ప్రజల ప్రాణాలంటే సర్కారుకు లెక్కలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అస్వస్థతకు గురైన ఏఎన్‌ఎం

మండల కేంద్రంలో ఐదు రోజులుగా డయేరియా కేసులు బారినపడిన వారికి విధి నిర్వహణలో భాగంగా తన వంతు వైద్య సహాయం అందిస్తున్న సంతోషి శుక్రవారం అస్వస్థతకు గురైంది. ఒక్కసారిగా బీపీ తగ్గడంతో గుర్ల జెడ్పీ హైస్కూల్‌లోని వైద్య శిబిరం వద్ద కుప్పకూలిపోయింది. సహచర ఉద్యోగులు ఆమెకు సపర్యలు చేసి వైద్యం అందించడంతో గంట తర్వాత ఆమె కొలుకుంది. డయేరియా కేసులు నమోదు ప్రారంభం అయినప్పటి నుంచి విరామం లేకుండా పని చేయడంతో పాటు సమయానికి తగిన ఆహారం తీసుకోకపోవడంతో అస్వస్థతకు గురైనట్లు సహచర వైద్య సిబ్బంది చెబుతున్నారు.


నిర్మానుష్యంగా మారిన వీధులు

గుర్లలో స్వచ్ఛంద కర్ఫ్యూ

ఈ నెల 12న ఎనిమిది మందితో గుర్లలో డయేరియా వ్యాధి ప్రారంభమయ్యింది. ఆ తరువాత 13న చింతపల్లి అప్పారావు అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ నెల 14న మరో ముగ్గురు మృతి చెందారు. ఇక అప్పటి నుంచి కేసుల సంఖ్య కూడా వందల్లో పెరుగుతూ వచ్చింది. దీంతో భయాందోళనలకు గురైన గ్రామస్తులు స్వచ్ఛంద కర్ఫ్యూ ప్రకటించుకున్నారు. ప్రస్తుతం గుర్ల మండల కేంద్రంతో పాటూ ఊరిలో ఎక్కడ చూసినా కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. గ్రామంలో ఒక్క దుకాణం కూడా తెరుచుకోలేదు. అంతేకాకుండా ఇళ్ల తలుపులు సైతం మూసుకునే దర్శనమిస్తున్నాయి. కరోనా సమయంలో కూడా లేని భయం ప్రస్తుతం గుర్ల వాసుల్లో కనిపిస్తోంది. వీధుల్లో, రోడ్లపై ఒక్కరూ కూడా కనిపించడం లేదు.


గుర్లలో డయేరియా రోగుల సమాచారం సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మద్యం దుకాణం ఏర్పాటుపై... మహిళల తిరుగుబాటు

- పచ్చని సంసారాల మధ్య చిచ్చు పెడతారా..?
- మహిళలను తిరగనివ్వరా..?


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బొబ్బిలి: పచ్చని సంసారాలతో గుట్టుగా కాలం వెళ్లదీస్తున్నాం... మా కాపురాల మధ్య బ్రాందీలు అమ్మి మా సంసారాలు చెడగొట్టవద్దంటూ మహిళలు కన్నెర్ర చేశారు. పట్టణంలోని మేదరిబంద జంక్షన్ వద్ద ప్రైవేటు లైసెన్సుదారులు వైన్స్ షాపు ప్రారంభించారు. జనావాసాల మధ్య వైన్స్ షాపు పెట్టేందుకు మీకు అనుమతులు ఎవరిచ్చారని ఆ ప్రాంతానికి చెందిన మహిళలంతా షాపు వద్ద శుక్రవారం బైఠాయించారు. తమ నిరసనను వ్యక్తపరుస్తూ నినాదాలు చేశారు. వైన్స్ షాపు వచ్చిన రాంబాబు, బాబూరావులు వారితో మాకు లైసెన్సు వచ్చింది... మాకు నచ్చిన చోట షాపు పెట్టుకుంటామని వారికి నచ్చజెప్పేలా వాదనకు దిగారు. దీంతో గలాటా పెద్దదయింది. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది వచ్చి మద్యం అమ్మకందారులకు మద్దతుగా మాట్లాడటంతో నిరసనకారులు మరింత ఆందోళన చెందారు. నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో పోలీసులు ఫొటోలు తీయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ షాపు ఇక్కడ పెట్టేందుకు అంగీకరించబోమని మహిళలు భీష్మించారు.

అధికారులకు బాధ్యత లేదా?

వైన్ షాపులు ఎక్కడైనా పెట్టుకోవచ్చని చంద్రబాబునాయుడు చెప్పినట్టు ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారులకు వంతపాడటం సరికాదని సీపీఎం జిల్లా నాయకులు పొట్నూరు శంకరరావు అన్నారు. మద్యం షాపుల వద్ద నిరసన చేస్తున్నప్పుడు అధికారులు కూడా ఆలోచించకుండా ఎలా వత్తాసు పలుకుతారన్నారు. బడి, గుడి, జనావాసాల కూడళ్ల వద్ద వైన్ షాపులు పెట్టకూడదన్న నిబంధనలను సుప్రీంకోర్టు సైతం పలుమార్లు గుర్తుకు తెస్తున్నప్పటికీ అధికారులు మద్యం వ్యాపారులకు మద్దతుగా నిలవడం ఆశ్చర్యకరమన్నారు. సీఐ తదితర అధికారుల తీరును మేం తీవ్రంగా ఖండిస్తున్నామని శంకరరావు అన్నారు. దీపావళికి బాణ సంచా ఊరి చివర పెట్టినా వెళ్లి కొనుగోలు చేసినట్టే మద్యం కూడా ఊరి చివరే పెట్టుకోవాలని ప్రొఫెసర్ రావాడ సత్యనారాయణ అన్నారు. అనంతరం అధికారులు తాత్కాలిక అనుమతులు ఇచ్చిన 10 రోజుల్లోగా మీ నిరసనల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పడంతో తాత్కాలికంగా మహిళలు నిరసనను విరమించారు.


నిరసన కారుల ఫొటోలను తీస్తున్న పోలీసులు, స్థానికులతో వాదులాడుతున్న మద్యం షాపు యజమానులు

పాలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

- లీటరుకు కనీసం రూ.10లు పెంచాలి
- పాడి రైతుల జిల్లా సదస్సులో రైతు సంఘం నేతల డిమాండ్

జామి: పాడి రైతుల నుంచి సేకరించిన పాల ధరకు, ప్రైవేటు డెయిరీదారుల అమ్మకాలకు మధ్య ధర వ్యత్యాసం ఉందని పాలకూ కనీస మద్దతు ధర ప్రకటించాలని పాడి రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బి.రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జామిలో పాడి రైతుల జిల్లా సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవు పాల ధరను విశాఖ డెయిరీ తగ్గించిన రూ.3ల నిర్ణయాన్నివెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ధాన్యం తదితర పంటల కనీస మద్దతు ధర ప్రకటించిన విధంగానే పాలకు కూడా మద్దతు ధర ప్రకటించాలన్నారు. పాడి రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని కాయకష్టం చేసుకుంటే విశాఖ డెయిరీతో పాటు హెరిటేజ్ వంటి ప్రైవేటు డెయిరీలు వారి కష్టాన్ని దోచుకుంటున్నాయని మండిపడ్డారు. రైతుల నుంచి సేకరించిన పాల ధరకు, మార్కెట్లో ప్రైవేటు డెయిరీదారుల అమ్మకాలకు మధ్య రూ.23 వ్యత్యాసం ఉందన్నారు. వాటిలో కనీసం రూ.10 లీటరుకు పాడి రైతులకు అందించాలన్నారు. డెయిరీ చెల్లించే ధరకు అదనంగా ప్రభుత్వం పోత్సాహకంగా రూ.8లు చెల్లించాలన్నారు. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న పాల ఉత్పత్తులను నిషేధించాలన్నారు. పాల ఉత్పత్తులు, యంత్రాలపై జీఎస్‌టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాడి పశువులకు రాయితీపై బ్యాంకులు రుణాలు అందించాలన్నారు. పశువుల దాణాను 75 శాతం రాయితీపై రైతులకు అందించాలని కోరారు. పాల సొసైటీలకు నిధులిచ్చి ఆర్థిక పరిపుష్టి కల్పించాలన్నారు. పాడి రైతుల సమస్యల పరిష్కారానికి రైతులంతా సంఘటితం కావాలని నేతలు పిలుపునిచ్చారు. అనంతరం జామి బస్టాండ్‌లో తమ డిమాండ్ల సాధనకు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు చల్లా జగన్, మద్దిల రమణ, గోపాలం, జి.అప్పారావు, గొర్లె రవికుమార్, బండారు పెదబాబు, ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పాల సంఘం కమిటీ ఎన్నిక

సదస్సు అనంతరం జిల్లా పాలరైతుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లోకవరపు ఆదినారాయణ, కార్యదర్శిగా గొంప రామకృష్ణను ఎన్నుకున్నారు.


జామి బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న పాడి రైతులు, రైతు సంఘం నేతలు

‘ఉల్లాస్’తో మహిళల్లో అక్షరాస్యత పెంపు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని నవంబరు 5న జిల్లాలో ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 48,578 మంది మహిళలను అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. వీరిని గుర్తించేందుకు ఈ నెల 24లోగా సర్వే పూర్తి చేసి, జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 29న కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, నవంబరు 2న మండల స్థాయి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సుమారు 4,800 వీటీ (వలంటీర్ టీచర్)ల ద్వారా వీరికి బోధన జరుగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. పొదుపు మహిళా సంఘాల్లోని చదువుకున్న వారిని వీటీలుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. 15 ఏళ్లు దాటి నిరక్షరాస్యులైన పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులు, కాపలాదారులు, అంగన్‌వాడీ సహాయకులు, వివిధ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న నిరక్షరాస్యులతో పాటు పారిశుద్ధ్య కార్మికులను కూడా ఎంపిక చేసి అక్షరాస్యులుగా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, వయోజనవిద్య డీడీ అల్లు సోమేశ్వరరావు, ఏఓ సీహెచ్‌ఆర్‌సీడీ లక్ష్మీ, డీఎల్‌డీఓ నిర్మలాదేవి, డీఏల్‌డీఓ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

వర్షాలపై అప్రమత్తంగా వుండాలి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని, వచ్చే మూడు నాలుగు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం దృష్ట్యా మరింతగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 22న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, అది ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన దృష్ట్యా అధికారులు తమ మండలాల పరిధిలో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రెండు తీరప్రాంత మండలాల పరిధిలోని గ్రామాల్లో తుఫాన్ షెల్టర్ల పరిస్థితిపై నివేదించాలని చెప్పారు. కల్వర్టులు, డ్రైనేజీ కాల్వలు, వాగులు వంటి చోట్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ వచ్చే పది రోజులూ నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో వున్నాయని, వీటిని వినియోగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. డయేరియా వంటి వ్యాధులు మళ్లీ ఎక్కడైనా ప్రబలినట్లయితే సహించబోమని స్పష్టంచేశారు. వాగులు, గెడ్డల నుంచి ప్రజలు తమ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతించాలని చెప్పారు. పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించి సంబంధిత ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. జెడ్పీ సీఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యోగా సాధకులు

ఘనంగా యోగారాధన

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో గల ‘శ్రీ యోగా’ కేంద్రంలో యోగా ఆచార్య రావర్తి రామారావు ఆరాధన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ప్రశాంతతతో కూడిన జీవనం లభిస్తుందన్నారు. ప్రపంచానికి భారత దేశం అందించిన మహోన్నత కానుక యోగా అని తెలిపారు. గురుదేవుల స్ఫూర్తితో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం పలువురికి వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గీత గోవిందరావు, శ్రీ యోగా ఫౌండేషన్ ప్రతినిధి కొవ్వాడ శ్రీనివాసరావు, సత్యనారాయణ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.


చదురుగుడి వద్ద చిన్నారుల నృత్యప్రదర్శన

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా చదురుగుడి, వనంగుడుల వద్ద నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక చదురుగుడి ఆవరణలో శుక్రవారం రాత్రి అమృత శ్రీవర్షిణి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ బృందం నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం ఉపద్రష్ట వరలక్ష్మి హరికథాగానం ఆకట్టుకుంది. కేపీ నాయుడు భక్తిగీతాలు ఆద్యంతం భక్తిభావాన్ని పెంపొందించాయి. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో ఎ.నాగపార్వతి సంగీతకచేరీ.. మద్ది సూరప్పడు అన్నమయ్య కీర్తనలు.. మక్కువ సూరినాయుడు, సిరిపురపు పోతినాయుడుల ఏకపాత్రాభినయనాలు అలరించాయి. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు.